మహబూబ్‌నగర్
వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# అన్నా.. జరా తప్పుకోవే..

## నేడు నామినేషన్ల ఉపసంహరణ

## రెబల్ అభ్యర్థులపై దృష్టి పెట్టిన నేతలు

**చిన్న చింతకుంట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పర్వం ముగియడంతో రెబల్ అభ్యర్థులపై రాజకీయ పార్టీలు దృష్టి పెట్టారు. వారి నామినేషన్ల ఉపసంహరణ కై నానా తంటాలు పడుతున్నారు. అధికార పార్టీలోనే దెబ్బలు అభ్యర్థులు ఉన్నారు. రెబల్ అభ్యర్థులను అన్నా.. జరా తప్పుకోవే అంటూ వేడుకుంటున్నారు. అధికార పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు. మండలంలో అల్లిపూర్, అమ్మాపూర్, గూడూరు, మద్దూరు, వడ్డేమాన్, నెల్లికొండి గ్రామాలలో అధికార పార్టీలో సర్పంచ్ సీటు దక్కకపోవడంతో రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ దృష్టికి తీసుకెళ్లి రెబల్ అభ్యర్థులు ఉపసంహరించుకునేలా చూడాలని వేడుకుంటున్నారు. రెబల్ గా నిలబడ్డ అభ్యర్థులు మేము పోటీలో ఉంటామని గట్టిగా చెప్తున్నారు. ప్రజాదరణ ఉన్న మాకు అధిష్టానం పోటీ చేసే అవకాశం ఇవ్వలేదని అందుకే సర్పంచ్ పోటీ చేస్తున్నామని రెబల్ అభ్యర్థులు ఖరాకండిగా చెప్తున్నారు. రేపు నామినేషన్ల ఉపసంహరణ కారణంగా రెబల్ అభ్యర్థులను బుజ్జగించే పనిలో కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఏది ఏమైనా రెబల్ అభ్యర్థులు సర్పంచ్ బరిలో ఉంటే అధికార పార్టీ సర్పంచ్ అభ్యర్థులకు ఇబ్బందులు తప్పవని ఆయా గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. అధికార పార్టీలోనే రెబల్ అభ్యర్థులు ఉండడంపై పార్టీ అధిష్టానం సర్పంచ్ గా అవకాశం ఇచ్చిన రెబల్ అభ్యర్థుల వల్ల ఓటమి తప్పదు అంటూ అధికార పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్ నాయక్

# జిల్లాలో 190 వరకు కొనుగోలు కేంద్రాలు

## రూ. 14.87 కోట్లు రైతుల ఖాతాలలో జమ

## అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్‌నాయక్ ఎన్ఫోర్స్మెంట్ డిటిలు, డిఆర్‌డిఏ డిపిఎంలు, ఏపీఎంలు, పిఏసి.ఎస్‌సి.ఈఓలతో వరి ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 12,420 రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి రూ. 14.87 కోట్లు రైతుల ఖాతాలలో జమ చేసినట్లు తెలిపారు. ఇంకా రూ.25 కోట్లు జమ కానున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఐకెపి, పిఏసిఎస్ ఇంచార్జి లు, మండల స్థాయి, గ్రామస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు సెంటర్ల ఇన్చార్జులు ఆదివారంలోగా తమ వద్ద పెండింగ్ లేకుండా ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సెంటర్ నుంచి సెంటర్ వారీగా తీసుకున్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా రైస్ మిల్లలకు పంపించే విధంగా సెంటర్ ఇంఛార్జిలు తగు చర్యలు తీసుకోవాలని ఏ రైతు కూడా రైస్ మిల్లు దగ్గరికి వెళ్లకూడదని అలాగే రైస్ మిల్లర్ల దగ్గర ఎటువంటి సమస్యలు లేకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు పర్యవేక్షణ చేస్తూ రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు సేకరణలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సివిల్ సప్లై ఎన్ఫోర్స్మెంట్ డి.టి.లను ఆయన ఆదేశించారు. ఈ వెబెక్స్ సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్, పౌర సరఫరాల సంస్థ డిఎం రవి నాయక్, జిల్లా సహకార అధికారి కృష్ణ, సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

### పంచాయతీ ఎన్నికలలో

# భార్యాభర్తల పోటీ

**మాగనూర్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** మూడవ విడత పంచాయతీ ఎన్నికలలో భార్యాభర్తలు పోటీ చేస్తున్నారు. మాగనూర్ మండల పరిధిలోని కోల్పూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ముద్దు నవ్య నామినేషన్ వేసింది. భర్త కె.వి నరసింహ 4వ వార్డ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. మాగనూర్ మండల కేంద్రంలో బుడగ జంగం నారాయణ 1వ వార్డుకు నామినేషన్ వేయగా, ఆయన భార్య బుడగ జంగం మంజు 11వ వార్డుకు నామినేషన్ వేసింది. భార్యాభర్తలు ఎన్నికలలో పోటీ చేయడంతో ఎవరు గెలుస్తారో అని గ్రామాలలో చర్చ జరుగుతుంది.



మాగనూర్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న భార్యాభర్తలు

## ఆవిష్కరణ వైపు

# నారాయణపేట

## పాఠశాలల్లో సృజనాత్మకతకు కొత్త అడుగు



టి మేకర్ స్పేస్ ప్రోగ్రాం , ఎటిఎల్ ల్యాబ్స్ రూపాంతర కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

**నారాయణపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా పాఠశాలల్లో నేర్చుకునే విధానాన్ని మరింత అనుభవపూర్వకంగా, సృజనాత్మకంగా మార్చే దిశగా రెండు కీలక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష, పీఎంశ్రీ పాఠశాలలు, వై హబ్ హెచ్‌పి ఇండియా ఇంక్విలాబ్ ఫౌండేషన్‌తో కలిసి టి మేకర్ స్పేస్ ప్రోగ్రాం మరియు 22 ఎటిఎల్ ల్యాబ్స్ రూపాంతర కార్యక్రమాలును ప్రారంభించింది. ఈ కార్యక్రమాల లక్ష్యం – పిల్లల్లో ఆలోచించగలగడం, పరిశీలించగలగడం, సృష్టించగలగడం అనే నేర్పులను మరింత బలంగా పెంపొందించడం టి మేకర్ స్పేస్ ప్రోగ్రాం ఆలోచనలను చేతుల్లోకి తీసుకురావడానికి వేదిక. ఈ కార్యక్రమం పిల్లలకు పుస్తకాలలో చదివే విషయాలను మించి, చేసి నేర్చుకునే అనుభవం ఇస్తుంది. రోబోటిక్స్, 3డీ ప్రింటింగ్, కోడింగ్, చిన్న మోడళ్ల రూపకల్పన వంటి అంశాల్లో 18 వారాలపాటు ప్రత్యేక శిక్షణ అందించబడుతుంది. పిల్లలు తమ చుట్టూ కనిపించే చిన్న సమస్యలను పరిశీలించి, వాటికి సాధ్యమైన పరిష్కారాలను ఆలోచించడం, వాటిని నమూనాలుగా తయారు చేయడం వంటి విషయాల్లో ముందడుగు వేస్తున్నారు. ఈ కార్యక్రమం పిల్లల్లో నేను కూడా చేయగలను" అనే ఆత్మవిశ్వాసాన్ని పెంచే దిశగా సాగుతోంది. 22 ఎటిఎల్ ల్యాబ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాఠశాలల్లో కొత్త అభ్యసన సంస్కృతికి శ్రీకారం 22ఎటిఎల్ ల్యాబ్‌లు పిల్లలకు ప్రయోగాలు చేయడానికి, ఆలోచనలను పరీక్షించడానికి, తమ చేతులతో నేర్చుకోవడానికి సహాయపడే సృష్టి స్థలాలు. ఈ రూపాంతర కార్యక్రమం ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న 22 ఎటిఎల్ ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో పనికొచ్చే ల్యాబ్‌లుగా అభివృద్ధి చేయడం, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం, విద్యార్థులకు ఇన్నోవేషన్ ప్రాజెక్టుల్లో మార్గనిర్దేశనం చేయడం చేపట్టబడుతోంది. దీంతో పాఠశాలల్లో శాస్త్రీయ దృక్కోణం, సమస్య పరిష్కార నైపుణ్యాలు, పరిశోధనా అలవాట్లు మరింత బలపడుతున్నాయి. కార్యక్రమాన్ని ఆవిష్కరిస్తూ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ మాట్లాడుతూ పిల్లల్లో ప్రశ్నించే అలవాటు, ఆలోచించే ధైర్యం, పరిష్కారాలను వెతికే పట్టు పెంపొందించడం ఈ కాలానికి అవసరమైన విద్య. ఈ కార్యక్రమాలు పిల్లలకు కొత్త అవకాశాలు తెరిచి పెట్టి, నేర్చుకునే విధానాన్ని మరింత ఫలవంతం చేస్తున్నాయి."అదనపు కలెక్టర్ శ్రీ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఎందుకు? అనే ప్రశ్నే ఆవిష్కరణకు మొదటి అడుగు. టి మేకర్ స్పేస్ ఎటిఎల్ ల్యాబ్‌లు ఆ ప్రశ్నలకు దారి చూపే వేదికలు. ఉపాధ్యాయులు, పాఠశాలలు పిల్లలకు తోడుగా నిలిస్తే వారు మరెన్నో కొత్త ఆలోచనలను ప్రపంచానికి పరిచయం చేస్తారు."పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డా. ఎం. గోవింద రాజు, ఎఎంఒ విద్యాసాగర్, సైన్స్ అధికారి భానుప్రకాశ్, ఆలోకిత్ యధునందన్, అలాగే ఇంక్విలాబ్ ఫౌండేషన్ ప్రతినిధి నగేష్ పాల్గొన్నారు. జిల్లా విద్యలో కొత్తది ఈ రెండు కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకత, ప్రశ్నించే దృక్కోణం, రూపొందించగల సామర్థ్యం పెంపొందిస్తూ, నారాయణపేట జిల్లా విద్యను కొత్త స్థాయికి తీసుకెళ్తున్నాయి. పిల్లలు తమ ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్చుకునేలా మార్గం సుగమం అవుతుండడంతో, జిల్లాలో ఆవిష్కరణ సంస్కృతి మరింత బలపడనుంది.

# నామినేషన్లు పకడ్బందీగా పరిశీలించాలి

## కలెక్టర్ విజయేంద్ర బోయి

## గంగాపూర్‌లో నామినేషన్ ప్రక్రియ పరిశీలన

**జడ్చర్ల, డిసెంబరు 5 ప్రభాతవార్త:** జడ్చర్ల మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయతీలో నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం సందర్శించారు. మూడో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగుస్తున్నందున నామినేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన నామినేషన్ పత్రాలను సరిగ్గా పరిశీలించి నమోదు చేసుకోవాలని, నిర్ణీత సమయం లోగా వచ్చిన నామినేషన్లు స్వీకరించాలని అన్నారు. శుక్రవారం మంచి రోజు అలాగే చివరి రోజు కావడం వలన నామినేషన్ దాఖలుకు అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో రావచ్చుని, రద్దీ ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనపు సిబ్బందిని నియమించి, నామినేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని, అలాగే నామినేషన్ డేటాను ఎప్పటికప్పుడు టీ పోల్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. టీ పోల్ యాప్‌లో డేటా అప్‌లోడ్ కు ఆలస్యం కాకుండా కంప్యూటర్లను, ఆపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేషన్లు సమయానికి పూర్తి చేయాలని, ఐదు గంటల లోపు వచ్చిన అభ్యర్థులకు వరుస క్రమంలో ఆఖరి నుండి టోకెన్ స్లిప్‌లు ఇవ్వాలని, సాయంత్రం 5:00 గంటల తరువాత ఎట్టి పరిస్థితులలో కొత్త నామినేషన్లు స్వీకరించవద్దని ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయంగా, ఎన్నికల సంఘం జారీచేసిన నియమ నిబంధనలను పాటిస్తూ, ఎటువంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని సూచించారు.



నామినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్





మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

### పాత-కొత్త కలయికే

# పార్టీకి బలం, విజయం

## మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.సంజీవ్ ముదిరాజ్ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి నూతన అధ్యక్షుడిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నాయకుల అనుభవం, కొత్తనాయకుల ఉత్సాహం కలిసినప్పుడే ఏ పార్టీ అయినా వృద్ధి సాధిస్తుందని మహబూబ్‌నగర్‌జిల్లాలో కాంగ్రెస్ విస్తరణకుఇదే సరైన సమయమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని" సూచించారు. జిల్లాలో ఉన్న ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు కొత్త అధ్యక్షుడి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే విశ్వాసాన్ని ఎమ్మెల్యే వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయ పథంలో అడుగులు వేయాలంటే సమష్టి కృషి అవసరమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రేవంత్ రెడ్డి నాయకత్వం వచ్చాకే పార్టీ బలపడ్డ తీరును ఆయన ఈ సందర్భంగా గుర్తుకు చేశారు. అలాగే మాజీ డిసిసి అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి గత మూడు సంవత్సరాలు జిల్లాలో – మిగతా3లో..



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

### రెండవ విడత ఎన్నికలకు

# ఏర్పాట్లు చేయాలి

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం మిడ్జిల్ మండలం ఎంపిడిఓ కార్యాలయం లో తహసీల్దార్, ఎంపిడిఓ, పంచాయతీ కార్యదర్శులతో ఎన్నికల ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ను , బ్యాలెట్ బాక్స్ లను పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఎంపిడిఓ కార్యాలయ ఆవరణ లో ఏర్పాటు చేయనున్న దృష్ట్యా పోలింగ్ మెటీరియల్ పంపిణీ కౌంటర్ లు ఏర్పాటు, వెహికల్ పార్కింగ్, బోజన ఏర్పాట్లను మ్యాప్ ద్వారా కలెక్టర్ కు ఎంపిడి ఓ వివరించారు. కలెక్టర్ తో పాటు తహశీల్దార్ పులి రాజు, ఎంపిడిఓ గీతాంజలి తదితరులు ఉన్నారు. పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి మహబూబ్ నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్ ను గ్రామ పంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి శుక్రవారం సందర్శించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యుల స్థానాలకు జరుగుతున్న మొదటి విడత ఎన్నికల్లో పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

# మల్దకల్ శ్రీ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలు

## కన్నులపండువగా రథోత్సవం

## తిమ్మప్ప గోవింద ..

## గోవిందా నామస్మరణతో

## మారుమ్రోగిన పట్టణ పురవీధులు

## హాజరైన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**మల్దకల్ డిసెంబర్ 5, ప్రభాతవార్త:** మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి 12 గంటలకు జరిగిన రథోత్సవం ఆద్యంతం కన్నులపండువగా సాగింది. లక్షలాది మంది భక్తుల మధ్య రథోత్సవం జరిగింది.. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తిమ్మప్ప స్వామి గుడి పరిసరాలాన్నీ గోవింద.. గోవిందా నినాదాలతో మారుమ్రోగిపోయాయి. మల్దకల్ ప్రాంత ప్రజల ఇలవేల్పు, ఆరాధ్య దైవంఅయిన శ్రీ తిమ్మప్ప స్వామి బ్రహ్మోత్సవాలు గత నెల 25 నుండి అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయని 11 రోజులపాటు జరిగే ఈ జాతరలో అనేక పూజాది క్రతువులు, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించబోతున్నాయని తెలియజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఈయేడాది జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రత్యేక శ్రద్ధతో ఈ జాతర కోసం అన్నీ ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇప్పటికే ఆలయ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నదని తెలిపారు. తిమ్మప్పజాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శనం చేసుకోవాలన్నారు. స్వామి వారి కృపాకటా క్షాలు గద్వాలజిల్లా ప్రజల మీద, తెలంగాణ ప్రజల మీద ఉండాలని, రాష్ట్ర ప్రజానీకం ఆయురారోగ్యాలతో జీవించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ యేడాది జాతర మరింత శోభాయమానంగా కొనసాగాలని ఆలయ చైర్మన్ పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి కోరారు.



భక్తుల మధ్య ముస్తాబైన రథోత్సవం



దర్శనానికి క్యూలైన్లో భక్తులు

### సిఈఐఆర్ పోర్టల్ ద్వారా

# 106 మొబైల్ ఫోన్లు రికవరీ

## బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ డా వినీత్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డా. వినీత్

**నారాయణ పేట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా గత మూడు నెలల్లో సిఈఐఆర్ పోర్టల్ సాయంతో రికవర్ చేసిన 106 మొబైల్ ఫోన్లను జిల్లా ఎస్పీ డా.వినీత్ నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు అందజేశార.ు రికవరీ చేసిన ఫోన్ల మొత్తం విలువ సుమారు రూ. 16 లక్షలు ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. దొంగతనానికి గురైన మొబైల్ ఫోన్లు నేరాలకు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పాత లేదా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనరాదని సూచించారు. మొబైల్ దొంగతనం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. దొంగిలించిన ఫోన్లను పట్టుకోవడం పోలీసుల బాధ్యతగా భావించి వాటిని ట్రేస్ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ రికవరీలో ఐటి కోర్ పోలీసులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఆధునాతన టెక్నాలజీ సాయంతో ఫోన్లను గుర్తించి 106 ఫోన్లను రికవర్ చేసిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డిఎస్పీలు లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, రాజేందర్ రెడ్డి, రామ్‌లాల్, సైదులు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. అలాగే మొబైల్ స్వీకరించిన బాధితులు కూడా హాజరయ్యారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఎస్పీ డా. వినీత్

# గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

## నారాయణ పేట జిల్లా ఎస్పీ డా. వినీత్

**నారాయణపేట డిసెంబర్5 ప్రభావిత :** నారాయణపేట జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన మక్తల్ జట్టుకు, రన్నర్‌గానిలిచిన మరికల్‌జట్టుకు క్యాష్ ప్రైజ్‌తోపాటు కప్పులను ఎస్పీ డా.వినీత్ అందజేశారు. ఈటోర్నమెంట్‌లో – మిగతా3లో..

## ఉద్యాన కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవం

**పెద్దమందడి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** పెద్ద మందడి మండల పరిధిలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో ఆరోగ్యకరమైన నగరాలకు ఆరోగ్యకరమైన నేలలు అనే థీమ్‌తో ప్రపంచ నేలల దినోత్సవం 2025ను నిర్వహించారు. ఈ సంవత్సరం పట్టణ ప్రకృతి దృశ్యాలపై దృష్టి పెడుతుంది అని యన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కె. భాస్కర్ తెలిపారు. విచక్షణ రహితంగా ఎరువులను, క్రిమి సంహారక మందులను ఉపయోగించవద్దు, పచ్చి రొట్ట ఎరువులను పెంచుతూ నేల సారాన్ని కాపాడుకోవాలని



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

అసోసియేట్ ప్రొ॥ డా. షహనాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలల పరిరక్షణకు కంకణ బద్దులై ఉండాలని మృత్తిక శాస్త్ర ప్రొ॥ మాధవి, విద్యార్థులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు భూసార పరీక్ష కొరకు మట్టిని సేకరించే విధానాన్ని క్షేత్రస్థాయిలో ఆమె విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమం

**మద్దూరు, డిసెంబరు 5 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ బాలుర పాఠశాలలో ప్రీ సైడింగ్ అధికారుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల విధి నిర్వహణలో కీలకమైన పీఓల బాధ్యతలు, ఆచరణ విధానాలపై టిఓటి టీమ్ ఆధ్వర్యంలో సమగ్రంగా వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామన్న ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పీఓల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.


ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతరం టిఓటి లు ప్రకాష్, అమ్రేష్, భాస్కర్ రెడ్డి పీఓలకు ప్రాక్టికల్ గైడ్‌లైన్స్, పోలింగ్ రోజు అనుసరించాల్సిన నిబంధనలు, ఈవీఎం-వీవీప్యాట్, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు చురుకుగా పాల్గొని విజయవంతంగా నిర్వహించారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బీజేపీ సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ**

**నారాయణ పేట, డిసెంబరు 5 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగురావు నామాజీ మాట్లాడారు. సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు నామినేషన్లు వేస్తే స్క్రూటినీ తర్వాత అప్పీల్‌కు సమయం ఇవ్వకుండా రిజెక్ట్ చేయడం ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లే అని పేట మండలం లింగంపల్లి గ్రామంలో ఇద్దరు అభ్యర్థులు సర్పంచ్ ఎన్నిక కోసం నామినేషన్లు వేస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి



మాట్లాడుతున్న సీనియర్ నాయకులు నాగురావ్ నామాజీ

రెండు నామినేషన్లు స్వీకరణ చేశామని నోటీసు బోర్డుపై అతికించి తీరా సాయంత్రం ఐదు గంటల తర్వాత ఓ అభ్యర్థి నామినేషన్ రిజెక్ట్ అయిందని చెప్పడం ఎన్నికల నిబంధన ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. చట్టాలను చేతిలోకి తీసుకునే అధికారం ఎవరికి కూడా లేదన్నారు. అలాగే పేరపల్ల గ్రామ రెండవ వార్డ్ పరిధిలో కూడా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, దీనిపై రాష్ట్ర ఎన్నికల అధికారికి,కలెక్టర్, ఆర్డీవోకు ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే అధికారులు స్పందించి ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, పోషల్ వినోద్, రఘువీర్ యాదవ్, నందు నామాజీ, కిరణ్ డగే, తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా అభ్యర్థుల నుండి నామినేషన్లు తీసుకోవాలి

**నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసిన మండల ఎన్నికల నోడల్ అధికారి వీరభద్రప్ప**

**ఇటిక్యాల డిసెంబర్5,ప్రభాతవార్త:** గ్రామాలలో సర్పంచులు. వార్డ్ నెంబర్లుగా పోటీ చేసే అభ్యర్థుల నుండి నామినేషన్ పత్రాలను టర్నింగ్ అధికారులు తీసుకోవాలని మండల ఎన్నికల నోడల్ అధికారి తాసిల్దారు వీరభద్రప్ప సూచించారు. శుక్రవారం మండలంలోని ఇటిక్యాల శుక్రవారం మండలంలోని ఇటిక్యాల. ఉదండాపురం చాగాపురం సర్పంచుల నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నామినేషన్ల చివరి రోజు కావడంతో నామినేషన్లు వేసేందుకు వచ్చే అవకాశం ఉంటుందని ఐదు


పత్రాలను పరిశీలిస్తున్న మండల ఎన్నికల నోడల్ అధికారి

గంటల లోపు అభ్యర్థులు నామినేషన్ కేంద్రాల్లో వద్దకు రాగానే వారికి టోకెన్లు జారీ చేసి నామినేషన్ వేసే అభ్యర్థుల నుండి నామినేషన్ పత్రాలను తీసుకోవాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు తాహసిల్దార్ వీరభద్రప్ప సూచించారు. వీరి వెంట ఆర్.ఐ.మదన్ మోహన్ ఉన్నారు.

## బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన చాగాపురం యువత

**ఇటిక్యాల డిసెంబర్ 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చాగా పురము గ్రామానికి చెందిన బిజెపి పార్టీ యువ నాయకుడు పరిసరాముడు ఆధ్వర్యంలో 20 మంది యువత శుక్రవారం శాంతినగర్ లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని


కాంగ్రెస్ పార్టీలోకి కండువా వేసి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే

ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ యువతకు సూచించారు. ఈకార్యక్రమంలో మండలకాంగ్రెస్‌పార్టీ అధ్యక్షు డు రుక్మానందరెడ్డి. చాగాపురం మండలం మైనార్టీ సెల్ అధ్యక్షుడు అల్లబకాష్. గ్రామ కమిటీ సభ్యులు చాందు, లింగన్న, ఆంజనేయులు, గొల్ల రామకృష్ణ, గోవర్ధన్, తదితరులు ఉన్నారు..

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు కేసు నమోదు :ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్

**లింగాల, డిసెంబరు 5 ప్రభాతవార్త:** ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం లింగాల మండల కేంద్రంలోని జనరల్ కిరాణం షాపులో ఆకస్మికంగా తనిఖీ చేసి, మద్యం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ల కు వచ్చిన పక్క సమాచారంతో ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన కోనేటి తిరుపతయ్య జనరల్ కిరాణం షాపులో దాదాపుగా రూ.5 వేలు విలువ


కిరాణం షాపులో మద్యం సీజ్ చేసిన ఎస్సై

చేసే మద్యం సీజ్ చేశారు. కోనేటి తిరుపతయ్య అదుపులో తీసుకొని ఎక్సైజ్ శాఖ చట్టం కింద కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా మద్యం నిల్వలు జనరల్ కిరాణం షాపులో ఉంటే అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాజమూరు ఆంజనేయ దీవించగా రావయ్య

# కన్నుల పండగగా అంజన్న రథోత్సవం

**వైభవంగా ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు**

**మార్మోగిన అంజన్న నామస్మరణ**

**ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే**

**దేవరకద్ర, డిసెంబరు 5 ప్రభాతవార్త:** రాజమూరయ్య దీవించక రావయ్య అంటూ ప్రజల ఆరాధ్య దైవం అయినటువంటి, ఇలవేల్పుగా కొలిచేటటువంటి దేవుడు చిన్న రాజమూర్ ఆంజనేయ స్వామి. దేవరకద్ర మండలంలోని చిన్న రాజమూరు ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు వేలాది భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తజనం. స్వామివారి దర్శనానికి బారులు తీరారు. ఈ సందర్భంగా అంజన్న నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ముందుగా కళ్యాణ కట్ట వద్ద భక్తులు తలనీలలను సమర్పించి, కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించారు. మరికొందరు ఆలయం వద్ద నైవేద్యాన్ని తయారుచేసి దాసంగాలు పెట్టారు. అంజన్న దర్శనం కోసం క్యూ లైన్‌లో బారులు తీరారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వరకు వాహనాలను అనుమతించలేదు. గ్రామం వెలపల ఏర్పాటు చేసిన పార్కింగ్ వాహనాలను తరలించారు. సీఐ రామకృష్ణ, ఎస్సై నాగన్న పర్యవేక్షించారు.

**కన్నుల పండుగగా అంజన్న రథోత్సవం..**

ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంజన్న రథోత్సవం శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు అంగరంగ


స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

వైభవంగా నిర్వహించారు. దేవరకద్ర మండలం, ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాకుండా కర్ణాటక, పూణే, సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణ నడుమ మంగళ వాయిద్యాల నడుమ, ఆలయం నుంచి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకొచ్చి, రథంపై కొలువు ధీరగా రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ నిలిచింది. అనంతరం విశేష పూజలు నిర్వహించి మంగళహారతులు ఇచ్చారు.

**రథోత్సవ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే...**

అంజన్న రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని అంజన్న స్వామివారిని దర్శించుకుని, రథోత్సవానికి హారతులు పట్టిన దేవరకద్ర ఎమ్మెల్యే


అంజన్న స్వామి దర్శనానికి క్యూలైన్లో భక్తజనం



మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, వివిధ పార్టీ నాయకులు, చిన్న రాజమూర్ భక్తులు. ఆ తర్వాత బాణసంచా పేలుల మధ్య జైశ్రీరామ్, జై జై శ్రీరామ్ అంటూ వంటి నినాదాలు నింగి నంటగా మార్మోగాయి. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం రథాన్ని తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్యాంసుందర్ చారి, చైర్మన్ రాఘవేంద్ర చారి, అర్చకులు హనుమేశాచారి, మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కోన రాజశేఖర్, ప్రేమ్ కుమార్, భరత్ కుమార్, లక్ష్మీ క్రాంత్ రెడ్డి, అంజన్ కుమార్ రెడ్డి, ముచ్చింతల వెంకటేశ్వర్ రెడ్డి,కార్యనిర్వాహకులు, దేవదాయ శాఖ అధికారులు, భక్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం

**కోలహాలంగా మారిన వెల్టూరు క్లస్టర్ , చివరి రోజు నామినేషన్ల జాతర**

**ఉప్పునుంతల, డిసెంబరు 5 ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికల కోసం అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు శుక్రవారం చివరి రోజు కావడంతో అన్ని గ్రామాల నుంచి సర్పంచులు, వార్డు స్థానాలకు అభ్యర్థులు పెద్ద ఎత్తున పోటీపడ్డారు. వాస్తవానికి ఈనెల 3 నుంచే నామినేషన్ల ప్రక్రియ చేపట్టగా మొదటి, రెండో రోజులు మందకొడిగా కొనసాగింది. మండలంలో 27 గ్రామ పంచాయతీలు,222 వార్డు సభ్యులకు అరకొరగా నామినేషన్లు దాఖలు చేసినప్పటికీ, చివరి రోజు అయిన శుక్రవారం క్లస్టర్ పరిధిలో భారీ సంఖ్యలో భారీ సంఖ్యలో హాజరు కావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద కిక్కిరిసి పోయింది. మండలంలోని వెల్టూర్ నామినేషన్ కేంద్రం కోలాహలంగా మారింది. సమయం


వెల్టూర్‌లో కోలాహలంగా మారిన నామినేషన్ కేంద్రం

ముగియడంతో నామినేషన్ల స్వీకరణ సమయం ముగిసే సమయానికి ప్రాంగణంలో వేచి ఉన్న అభ్యర్థులందరినీ నామినేషన్లు వేసేందుకు అనుమతించారు. నామినేషన్లను ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాల్సి ఉండగా శుక్రవారం రద్దీ ఎక్కువగా ఉండడంతో అధికారులకు తలనొప్పిగా మారింది. నామినేషన్ కేంద్రాల వద్ద అంతకు ముందే ఏర్పాటు చేసిన డిటిపి ఆపరేటర్లకు తోడుగా ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల ను ఆయా కేంద్రాలకు తరలించి ఆన్ లైన్ చేసే పనులను అప్పగించారు. నామినేషన్ల స్వీకరణ సమయం ముగిసినప్పటికీ పూర్తి వరకు రాత్రి పొద్దు పోయింది. చివరి రోజైనా శుక్రవారం నామినేషన్ల కేంద్రాల వద్ద కోలాహలంగా మారింది.

## బిఆర్ఎస్‌తోనే గ్రామ అభివృద్ధి సాధ్యం

**పెద్దమందడి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** గ్రామం అభివృద్ధి బిఆర్ఎస్ నుంచి సాధ్యమని మండల నాయకులు పి.జగదీశ్వర్ రెడ్డి అన్నారు. పెద్దమందడి మండలంలోని విలేకరుల సమావేశంలో జగదీశ్వర్ రెడ్డితో పాటు జిల్లా బి ఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్‌తో కలిసి ప్రెస్ మీట్ నిర్వహించారు. అందులో భాగంగా గ్రామ అభివృద్ధి కేవలం బిఆర్ఎస్, అభివృద్ధి చేస్తుందని బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ ఎన్నుకుంటే గ్రామాలు అభివృద్ధి అవుతాయని జగదీశ్వర్ రెడ్డి అన్నారు. సర్పంచ్‌గా స్వాతి హరి కుమార్ రెడ్డిని సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని ఆయన కోరారు. జిల్లా నాయకులు గట్టు యాదవ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో చెరువులకు నీరు నింపుతూ రైతులకు వ్యవసాయానికి


సర్పంచ్‌గా తనను గెలిపించాలని కోరుతున్న స్వాతి కుమార్ రెడ్డి

నీరు అందించింది బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని గ్రామపంచాయతీలకు ట్రాక్టర్లు మంజూరు చేశాయని గట్టు యాదవ్ గుర్తు చేశారు. బి ఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఆసరా పింఛన్లు, ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, కేసీఆర్ కిట్లు , రైతుబంధు, సంక్షేమ పథకాలు బి ఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగాయని వాకిటి శ్రీధర్ అన్నారు. పెద్దమందడి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా స్వాతి హరి కుమార్ రెడ్డిని గెలిపించి బ్యాట్ గుర్తుకు ఓటు వేయాలని గ్రామాన్ని అభివృద్ధి చేయాలని వాకిటి శ్రీధర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా బిఆర్ఎస్ నాయకులు పరంజ్యోతి, ప్రేమ్ కుమార్, పెద్దమందడి బిఆర్ఎస్ మండల నాయకులు సేనాపతి చారి, స్టార్ శ్రీనివాసులు రమేష్, హరి కుమార్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, కుడుకుంట్ల సత్యం, మురళి గౌడ్, దొడ్డుంటపల్లి చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి పోలింగ్ చిట్టీలు అందజేయాలి

**ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు తప్పవు, మండల ఎన్నికల ప్రత్యేక అధికారి, డిఆర్డిప నరసింహులు**

**చిన్నచింతకుంట,డిసెంబరు 5 ప్రభాతవార్త:** ఈనెల 14న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి పోలింగ్ చిట్టీల పంపిణీ చేయాలని మండల ఎన్నికల ప్రత్యేక అధికారి, డిఆర్‌డిప పిడి నరసింహులు ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బిఎల్ఓలకు పోలింగ్ చిట్టీల పంపిణీ పై అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాల్లోని పోలింగ్ జాబితాలో ఉన్న ఓటర్లకు పోలింగ్ స్లిప్పులను అందజేయాలని తెలిపారు. స్లిప్పుల పంపిణీ చేసే క్రమంలో ఎవరైనా లేకపోయినా ఇంటి ప్రక్క వారికి ఇచ్చి వారితో సంతకం తీసుకోవాలని ఆయన సూచించారు. పోలింగ్ జాబితాలోని పోలింగ్ స్లిప్పులను ఏ రాజకీయ పార్టీల నాయకులకు ఇవ్వరాదని, అలా ఇచ్చినట్లయితే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అభ్యర్థుల ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నట్లయితే సస్పెండ్‌కు గురవుతారన్నారు. మండలంలో 174 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పోలింగ్ స్టేషన్‌లలో ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. వికలాంగుల ఓటర్లకు తోపుడు బండి, విద్యుత్ సరఫరా, మంచినీటి సౌకర్యం,భోజన వ్యవస్థ చూసుకోవాలని ఆయన తెలిపారు. పోలింగ్ స్లిప్పులు అందని వారికి పోలింగ్ జరిగే రోజు 100 మీటర్ల దూరంలో పోలింగ్ స్లిప్పులను అందజేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దారు ఎల్లన్న, ఎంపీడీవో లక్ష్మీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


పోలింగ్ స్లిప్పుల పంపిణీ పై అవగాహన సమావేశం

**ఎన్నికల ప్రవర్తన నియమావళి**

## పక్కాగా అమలు కావాలి


నామినేషన్ కేంద్రం సందర్శించిన ఎన్నికల పరిశీలకురాలు

**ఉప్పునుంతల,డిసెంబరు 5 ప్రభాతవార్త :** మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను సాఫీగా నిర్వహించేందుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల పరిశీలకురాలు అన్నారు. నామినేషన్ల ప్రక్రియ ముగింపు రోజైన శుక్రవారం ఆమె మండల కేంద్రంలో నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు, బ్యాలెట్ బాక్సు, రవాణా, జోన్ల రూట్ అన్ని అంశాల్లో పటిష్టంగా చర్యలు తీసుకోవడం జరిగిందని ఆమె వివరించారు.

## జిల్లా అధ్యక్షుడికి శుభాకాంక్షలు


శాలువాతో సన్మానిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి

**దేవరకద్ర, డిసెంబరు 5 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, నాగిరెడ్డి కలసి నూతన అధ్యక్షుడికి పూల బొకే, శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగానికి అవకాశం

**మద్దూరు,డిసెంబరు 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం (6వ తేదీ) పోస్టల్ బ్యాలెట్ ఓటువినియోగ కేంద్రాన్ని ఏర్పాటుచేస్తున్నట్లు ఎంపీడీవో రామన్న తెలిపారు.ఎన్నికల విధుల్లో పనిచేస్తున్న ప్రభుత్వఉద్యోగులు ఈఅవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఉద్యోగులు కింది పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. 1. ఫారం-142. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికేట్ (ఇడిసి)3. ఓటరు ఐడి కార్డు 4. ఉద్యోగి ఐడి కార్డుఈ పత్రాలతో ఉద్యోగులు మండల కేంద్రంలోని పోస్టల్ బ్యాలెట్ వినియోగ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ఎంపీడీవో రామన్న తెలిపారు.

# జోరందుకున్న గ్రామపంచాయతీ ఎన్నికల మూడోదశ నామినేషన్లు

**- పోటాపోటిగా సర్పంచి,వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలు**

**భూత్పూర్,డిసెంబర్ 5,ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికల మూడోదశ సర్పంచి,వార్డు సభ్యుల నామినేషన్ల దాఖలుకు చివరి రోజైన శుక్రవారం ఆయా పదవులను ఆశించే అభ్యర్థుల నామినేషన్ల పర్వం జోరందుకుంది.నామినేషన్లకు చివరి రోజు కావడంతో అభ్యర్థులు పోటా పోటీగా తమ నామినేషన్లు దాఖలు చేశారు.భూత్పూర్ మండలంలోని 19గ్రామపంచాయతీలకు 19మంది సర్పంచులు,174వార్డు సభ్యుల పదవుల కోసం ఈ నెల 3వ తేది బుధవారం నుంచి 5వ తేది శుక్రవారం వరకు మూడ్రోజుల పాటు మండల ఎన్నికల అధికారులు అభ్యర్థు ల నుంచి నామినేషన్లు స్వీకరించారు.నామినేషన్ల మూడో రోజు శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీల గ్రామాలలో అభ్యర్థులు,గ్రామాల ప్రజల్లో కోలాహలం నెలకొంది.

**పోతులమడుగులో బీఆర్ఎస్,కాంగ్రెస్ బలపరిచిన సర్పంచుల అభ్యర్థుల ఆర్భాటాల మధ్య నామినేషన్**

భూత్పూర్ మండలం పోతులమడుగులో సర్పంచి అభ్యర్థులు ఆర్భాటాల మధ్య నామినేషన్లు దాఖలు చేశారు.బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి మనెమోని సత్యనారాయణ గ్రామంలోని వేణు గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి,బొడ్రాయి పూజలుచేసి గ్రామస్తులతో గ్రామంలో భారీఊరేగింపు నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు.నామినేషన్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచి పార్టీసీనియర్ నేత టి మురళీధర్‌గౌడ్,మేకల సత్యనారా యణలతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, గ్రామయువకులు,మహిళలు,గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ఆనంద్‌రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్‌ల ఆధ్వర్యంలో ఆనంద


పోతులమడుగులో భారీ ఊరేగింపుతో నామినేషన్ దాఖలుకు వెళ్తోన్న బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి మనెమోని సత్యనారాయణ

ర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.కొత్తమొల్గరలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి వెంకటేష్,అన్నాసాగర్‌లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఆలశ్రీకాంత్‌రెడ్డి,కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి కరెంట్ నర్సింహులు,తాటికొండలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిశ్రీధర్‌రెడ్డి, హస్నాపూర్‌లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి సంజీవరెడ్డి, ఇండిపెండెంట్ అభ్యర్థి యువకుడైన వినోద్‌కుమార్ నామినేషన్లు దాఖలు చేయగా,కప్పెటలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి మాసగౌడ్ సర్పంచి పదవి కోసం నామినేషన్ దాఖలు చేశారు.

**తాటిపర్తిలో బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి ఫసియొద్దిన్ నామినేషన్ దాఖలు**

భూత్పూర్ మండలం తాటిపర్తిలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ఎండి ఫసియొద్దిన్ సర్పంచి పదవి కోసం శుక్రవారం ఎంతో ఆర్భాటంగా తన నామినేషన్ దాఖలు చేశారు.ఈ కార్యక్రమానికి


కాంగ్రెస్ బలపరిచిన సర్పంచి అభ్యర్థి ఆనంద్‌రెడ్డి


తాటిపర్తిలో అభ్యర్థి ఎండి ఫసియొద్దిన్

బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు నాయకులు సత్తూర్ నారాయణగౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్ ఇతర నాయకులు,గ్రామ యువకులు,గ్రామస్తులు,మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జాతీయ స్థాయిలో రాణించాలి

◆ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దృశ్యం


విద్యార్థినిలకు షీల్డ్‌ను బహూకరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త:** జిల్లాలో క్రీడాస్ఫూర్తి, యువత ప్రతిభను వెలికి తీసే దిశగా నిర్వహిస్తున్న 51వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు. కబడ్డీ క్రీడను రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు యువతలో ఆత్మ విశ్వాసం, ధైర్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే అసలైన పాఠశాలలు, చదువుతో పాటు క్రీడలను అలవాటు చేసుకున్న యువత ఏ రంగంలోనైనా అత్యుత్తమ ఫలితాలు సాధిస్తారు" అని అన్నారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత క్రీడల అభివృద్ధిని రాష్ట్ర ప్రాధాన్య ప్రణాళికల్లో భాగం చేశాం. గ్రామ పంచాయతీ స్థాయిలోనుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడామౌలిక సదుపాయాల విస్తరణ, స్టేడియంల నిర్మాణం, ఆటలను ప్రోత్సహించే పథకాల అమలు నిరంతరం జరుగుతున్నాయి" అని తెలిపారు. తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపనతో క్రీడాకారులు శాస్త్రీయ శిక్షణ, జాతీయ స్థాయి కోచ్‌లు, ఆధునిక సదుపాయాలను పొందగలరని ఆయన చెప్పారు. తెలంగాణ జిల్లాలోని ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను ఆ యూనివర్సిటీతో అనుసంధానం చేసి ముందుకు తీసుకెళ్లే ప్రణాళిక ప్రభుత్వం సిద్ధం చేస్తోందని ఆయన అన్నారు. జిల్లా స్థాయిలో క్రీడల అభివృద్ధి దృష్ట్యా, స్థానిక స్టేడియంలను ఆధునీకరణ, యువతకు తక్కువ ఖర్చుతో శిక్షణ, పాఠశాలలలో క్రీడా ప్రోత్సాహం, ప్రతిభ ఉన్న ఆటగాళ్లను రాష్ట్ర స్థాయి పోటీలకు తీసుకెళ్లడం వంటి చర్యలు వేగవంతం చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. "క్రీడలో రాణించడానికి క్రమశిక్షణ, పట్టుదల, కఠిన సాధన తప్పనిసరని, మీ ప్రతిభను ప్రపంచానికిచూపించడానికి ఇలాంటి వేదికలను వినియోగించుకోవాలని అన్నారు. కబడ్డీ పోటీల విజయవంతమైన నిర్వహణకు జిల్లా కబడ్డీ సంఘం, క్రీడాశాఖ అధికారులు, నిర్వాహక బృందాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, రామచంద్రయ్య పడాకుల బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


51వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

## మక్తల్ రాంలీలా మైదానంలో కన్నుల పండుగలా పాలవుట్ల కార్యక్రమం


పాలవుట్ల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**మక్తల్ టౌన్, డిసెంబరు 5 (ప్రభాతవార్త):** మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో శ్రీశ్రీశ్రీ పడమటి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పాలవుట్ల కార్యక్రమం శుక్రవారం సాయంకాలం కన్నుల పండుగగా జరిగింది. పట్టణంలోని భక్తులు జనసంద్రంగా మారి రాంలీల మైదానంలో భక్తులతో కిక్కిరిసిపోయి కన్నుల పండగ పాలవుట్ల కార్యక్రమం జరిగింది. శ్రీ ఆంజనేయ స్వామి ముందున్న జాతీయ రహదారిఅరగంటసేపు జలదిగ్బదంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు వెంటనే ట్రాఫిక్‌ను అదుపు లోకి తీసుకొని వాహనాలను నిలిచి వేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకున్నారు.

## ఉప్పునుంతల మండల గ్రామ పాలన అధికారుల కమిటీ ఎన్నిక


ఉప్పునుంతల మండల గ్రామ పాలన మండల కమిటీ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న తహసీల్దార్ అద్దంకి సునీత

**ఉప్పునుంతల, డిసెంబరు5 ప్రభాతవార్త:** గ్రామ పాలన అధికారుల రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఉప్పునుంతల మండల గ్రామ పాలన అధికారుల మండల స్థాయి కమిటీని శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అచ్చంపేట డివిజన్ అధ్యక్షులు శంకర ఆధ్వర్యంలో మండలస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల గ్రామ పాలన అధ్యక్షుడిగా మారేడు వెంకటేష్, ఉపాధ్యక్షులు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి సతీష్, ఈసి మెంబర్ శంకర్, ఆంజనేయులు, రమేష్, కవితలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం తహశీల్దార్ అద్దంకి సునీత గ్రామ పాలన అధికారుల మండల స్థాయి కమిటీని శాలువా కప్పి ఘనంగాసన్మానించారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

**కృష్ణ, డిసెంబరు5 ప్రభాతవార్త:** అనుమతి లేకుండా మాన్వి నుండి సైదాపూర్‌కు అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పరును (కెఎ33బి7862) కృష్ణ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. గుడేబల్లూరు లోని టై రోడ్ దగ్గర నిర్వహించిన తనిఖీల్లో బాగంగా ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నారు. ఎస్ఐ ఎస్ఎం నవీద్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇసుక అక్రమంగా తరలిసే కఠిన చర్యలు


ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు

**నారాయణ పేట, డిసెంబరు5 ప్రభాతవార్త:** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని పట్టుకున్నారు. పాత తాండ నుండి కొల్లంపల్లి గ్రామానికి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న కుక్కలి అశోక్ కొత్త మొగులప్పలను పిడుగుండు తాండ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఇద్దరు నిందితులపై కేసులు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై రాముడు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

## నా శేష జీవితం లయన్స్ క్లబ్ సేవలకు అంకితం: విశ్రాంత ఆర్టీవో వీరస్వామి


విశ్రాంత ఆర్టీఓ రామస్వామని సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణపేట, డిసెంబరు 5 ప్రభాతవార్త:** నారాయణ పేట లయన్స్ క్లబ్ ఆఫ్ వారు మొదటి జిల్లా గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ ఆధ్వర్యంలో వీరస్వామిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముందు మహాంకాళి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు పేట జిల్లా మాజీ ఆర్టీవో వీరస్వామి మాట్లాడుతూ తన మిగిలిన జీవితం మొత్తాన్ని లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల కు అంకితం చేస్తున్నానని తెలిపారు. పదవులు శాశ్వతం కావని, మనం చేసేపని, సేవే మనను ప్రజల్లో నిలబెడుతుందని చెప్పారు. సమాజ సేవలోపాల్గొనడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందు కు రావాలని, సేవాభావంతో పని చేసినప్పుడు వృత్తికీ, వ్యక్తికీ నిజమైన గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మరాం, ఏడికే శ్రీనివాస్, లాహోటి జనార్ధన్, రిటైర్డ్ ఎంఈవో వెంకటయ్య, బీం చందర్ గౌడ్, సదానంద్ చారి పాల్గొన్నారు.

## ముగిసిన మూడో విడత గ్రామపంచాయతీ నామినేషన్ల స్వీకరణ

**శ్రీరంగాపూర్, డిసెంబరు5 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని గ్రామాలలోగ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల నామినేషన్ల స్వీకరణ శుక్రవారం ముగిసింది. శ్రీరంగాపూర్ ఎంపీడీవో రవి నారాయణ వివరణ ప్రకారం మొత్తం 8 గ్రామ పంచాయతీలకు గాను60 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు వేయగా 82 వార్డు మెంబర్లకుగాను 211 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం జరిగింది. కంబాలాపురం గ్రామంలో 9 మందిసర్పంచ్ అభ్యర్థులుగాను 29మంది వార్డ్ మెంబర్లు, వెంకటాపురంలోఐదు మంది సర్పంచ్, 20 మంది వార్డ్ మెంబర్లకు గాను, జానంపేట గ్రామంలో 9 మంది సర్పంచ్, 21 వార్డ్ మెంబరన్లకు గాను, నగరాల గ్రామంలో ఆరు మంది అభ్యర్థులు సర్పంచ్ గాను 20 మంది వార్డ్ మెంబర్లకుగాను, నాగసానిపల్లి గ్రామంలో 7 మంది సర్పంచ్ అభ్యర్థులకు గాను, 19 మంది వార్డు మెంబర్లకు గాను, షేర్ పల్లి గ్రామంలో 6 మంది సర్పంచి అభ్యర్థులకు గాను 23 మంది వార్డ్ మెంబర్లకు గాను, శ్రీరంగాపురంలో, 11 మంది సర్పంచ్ అభ్యర్థులకుగాను 45 మంది వార్డు మెంబర్లకు గాను నామినేషన్లు వేయడం జరిగిందని తెలియజేయడం జరిగింది.

## గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)

12 పోలీస్ స్టేషన్ల పరిధిలోని 24 యువజట్లు, అలాగే రెవెన్యూ,మీడియా, డాక్టర్స్, పోలీస్ టీంలు పాల్గొనడం విశేషం. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు క్రమశిక్షణ, ఓర్పు, సహనం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో గెలు పు-ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించే స్పోర్ట్స్ మెన్‌షిప్ ప్రతి క్రీడాకారుడిలో ఉండాలని సూచించారు. క్రీడల్లో పా ల్గొనడం ద్వారా శారీరక-మానసిక ఆరోగ్యం మెరుగుపడి, ఒత్తిడి తగ్గి, స్నేహభావం పెరుగుతుందని పేర్కొన్నారు యువత క్రీడల వైపు దృష్టి సారించాలని,శాంతి భద్రతల్లో కూడా వారి భాగస్వామ్యం ముఖ్యమని ఎస్పీ తెలిపారు. ప్రతి యువకుడు యూనిఫాం లేని పోలీస్" అని గుర్తుంచుకోవాలని సూచించారు.వచ్చే ప్రతి ఏడాది నవంబర్‌లోఈ టోర్నమెంట్‌ను నిర్వహించాలనిఅధికారులకు ఆదేశాలు జారీచేశారు.విజేతలకు రూ.10,000 ప్రథమ బహుమతిని డా. ప్రసాద్ శెట్టి, రన్నర్స్‌కు రూ.5వేల బహుమతిని డా. మధుసూ దన్ రెడ్డి స్పాన్సర్ చేశారు. కార్యక్రమం మొత్తం భోజనాన్ని అందిం చిన లయన్స్ క్లబ్ సభ్యులకు ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫైనల్‌లో మరికల్ జట్టు 84/7 చేయగా, మక్తల్ జట్టు 8.2 ఓవర్ల లో లక్ష్యాన్ని చేధించింది. హనుమంతు, కృష్ణ మండలం బెస్ట్ బ్యా ట్స్‌మన్, సురేష్ బెస్ట్ బౌలర్, మాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీలు, సీఐలు, వైద్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పాత-కొత్త కలయికే పార్టీకి బలం, విజయం


కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికై సంతకం చేస్తున్న సంజీవ్ ముదిరాజ్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా, పార్టీని నిలబెట్టడంలో పోషించిన పాత్ర చాలా కీలకం అని ఆయన చెప్పారు. ఈసందర్భంగా మాజీ డిసిసి అధ్యక్షులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కొత్త వారికీ అవకాశాలు ఇవ్వడంతో పాటు పాత నాయకులకు గౌరవం తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో నూతన డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ డిసిసి అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు స్వీకరించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఎఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు డా. చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, టీపిసిసి ప్రతినిధి జహీర్ అక్తర్, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్‌పి వెంకటేష్, మారేపల్లి సురేందర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధా అమర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, గోపాల్ యాదవ్, అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హన్వాడ మండల అధ్యక్షుడు వి.మహేందర్, చెన్నయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నవనీత, శారద, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్, మాధవరెడ్డి, ఫయాజ్,తాహేర్, అనుప ఆంజనేయులు,యాదిరెడ్డి, రఘు దాసరి, జె.వెంకటయ్య, జేసిఆర్, అబ్దుల్ హక్, మోయిజ్ తదితరులు పాల్గొన్నారు.

## భూమికి ఎప్పుడూ విలువ పెరుగుతుంది : ఎమ్మెల్యే యెన్నం

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు5 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ పరిధిలోని ఎదిర, ఐటి పార్క్ సమీపంలో శ్రీరామచంద్ర కాలనీ" నూతన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైప్రారంభించారు. అనంతరం వెంచర్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూమికి ఎప్పుడూ విలువ ఉంటుందని. సరైన ప్రదేశంలో,సక్రమపద్ధతుల్లో అభివృద్ధి చేసిన భూమి పెట్టుబడులు తరతరాలకు ఉపయోగపడే ఆస్తులని, మహబూబ్‌నగర్ ప్రస్తుతం రాష్ట్రంలో అత్యంత వేగంగా ఎదుగుతున్న నగరాల్లో ఒకటి. రాబోయే రోజుల్లో ఐటి పార్క్ విస్తరణ,రింగ్ రోడ్, హెల్త్ సిటీ, నేషనల్ హైవే విస్తరణ వంటి ప్రాజెక్టులతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతఇస్తోంది.రోడ్లు, డ్రైనేజ్, విద్యుత్, తాగునీటి సదుపాయాలు,ఐటి రంగ ప్రోత్సాహం, ఇవన్నీ మహబూబ్ నగర్ భవిష్యత్తు విలువను రెట్టింపు చేసే అంశాలు. ప్రజలకు నాణ్యమైన నివాస ప్రాంతాలను అందించడం ప్రభుత్వ లక్ష్యం అని ఆయన చెప్పారు. ఈ వెంచర్ కూడా అదే దిశగా ఒక ముందడుగు అని పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి మహబూబ్ నగర్ నగరంరూపం మారిందన్నారు. అన్ని రంగాల్లో మహబూబ్ నగర్ అభివృద్ధి లో పరుగులు పెడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు శాంతన్న యాదవ్, శ్రీనివాస్ యాదవ్, శివశంకర్, చర్ల శ్రీనివాసులు, గ్యాస్ అంజి, శ్రీశైలం, అల్లి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# టియుడబ్ల్యుజెతోనే జర్నలిస్టుల సంక్షేమం

- ఐజెయు నిరంతరం జర్నలిస్టుల పక్షాన పోరాటం
- త్వరలోనే యూనియన్ నుంచి హెల్త్ క్యాంపు, శిక్షణ తరగతులు
- టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్
- యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం
- అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజుగౌడ్, సతీష్ రెడ్డి


నాగరాజుగౌడ్


సతీష్ రెడ్డి


జిల్లెల రఘు, కోశాధికారి

**మహబూబ్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త:** టియుడబ్ల్యుజే (ఐజెయూ)గత 70 ఏళ్లుగా నిరంతరంగా జర్నలిస్టుల పక్షాన్నే పోరాటం చేస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ పునరుద్ఘాటించారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాపరెడ్డి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభను కనివినీ ఎరుగనిరీతిలో విజయవంతం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్‌లో ఒకరు గొప్ప మరొకరు తక్కువ అని ఉండదన్నారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని, జర్నలిస్టుల కోసం వారి సంక్షేమం కోసం నిరంతరంగా కృషి చేయాలన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపులు,శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఎన్నికల అధికారి బాలస్వామి మాట్లాడుతూ జిల్లా కమిటీ ఏకగ్రీవం చేసేందుకు అందులో భాగస్వాములైన అందరికి ధన్యవాదాలు తెలిపారు. నూతన కమిటీ బాగా పని చేసి గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగాలని కృషి చేయాలన్నారు. ఇండ్లు రాని జర్నలిస్టుల పక్షాన పోరాడాలని కోరారు. ప్రశాంత్ మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా ఉమ్మడి జిల్లాలో కమిటీలు, మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు. సమిష్టిగా ఏకగ్రీవం చేసినందుకు సంతోషంగాలో ఉందని యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు దత్తుమాట్లాడారు.మహాసభ కన్వీనర్ కేపే విజయరాజు మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**నూతన కార్యవర్గం ఏకగ్రీవం..**

టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడిగా నాగరాజుగౌడ్, జిల్లా కార్యదర్శిగా ఎన్ సతీష్ కుమార్ రెడ్డి, కోశాధికారిగా జిల్లెల రఘు, ఉపాధ్యక్షులుగా పవన్ కుమార్ రెడ్డి, కరణం భాస్కర్ రావు, ఐలమోని శేఖర్, మెహరాజ్ సంయుక్త కార్యదర్శులు గా ఎం రవీందర్ గౌడ్, ఎండి జాఫర్, ప్రభాకర్, గోకులం వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా ప్రశాంత్, వేణుగోపాలచారి,గొడుగు వెంకటయ్య, వీరాజీ, శేఖర్, శివప్రసాద్ గౌడ్,శేఖర్,అనిల్‌కుమార్,శివకుమార్,వెంకటేష్‌గౌడ్, నరసింహా రెడ్డి,ఎం శ్రీనివాసులు, రామకృష్ణ, వేణు, మాణిక్‌రావు, ఎన్ చంద్రశేఖర్‌గౌడ్, కొత్త గోపాల్ ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



## ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

### స్టేజ్ 1 రిటర్నింగ్ అధికారులతో వెబెక్స్ సమీక్ష సమావేశంలో మహబూబ్‌గర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి


వెబెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు5 ప్రభాతవార్త:** అభ్యర్థుల ఉపసంహరణ తుది పోటీ అభ్యర్థుల జాబితా (ఫారమ్-9) తయారీతో పాటు ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలనిఎంపీడీవోలు, స్టేజ్-1 ఆర్‌ఓలకు ఆదేశించారు. మొదటిదశ,రెండవ దశ ఎన్నికల మండలాల ఎంపీడీఓలు, ఎంపిఓలు స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. తుది జాబితా తయారీ, గుర్తుల కేటాయింపు సమయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి అని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటికే తుది అభ్యర్థుల జాబితా ప్రకటించిన నేపథ్యంలో,గుర్తుల కేటాయింపు ప్రక్రియలో అభ్యర్థుల పేర్లలోని అక్షరాల క్రమాన్ని ఆధారంగా తీసుకుని గుర్తులు కేటాయించాలని సూచించారు.ఏవైనా లోపాలు గుర్తిస్తే వాటిని వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ఎంపీడీవోలు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు,ఇతర పోలింగ్ సామాగ్రి సిద్ధంగా ఉంచాలని ఆమె సూచించారు. అలాగే డిసెంబర్ 8న పీవోలు, ఓపీవోల కోసం రిఫ్రెషర్ శిక్షణాకార్యక్రమం నిర్వహించి,డిసెంబర్ 11, 2025న జరగనున్న తొలిదశ ఎన్నికలకు, పోలింగ్ సిబ్బందిని సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రెండో దశ మండలాల ఎంపీడీఓ లకు, ఉపసంహరణల తరువాత ఫారమ్-9ను సిద్ధం చేసి,తుది అభ్యర్థుల వివరాలను నమోదు చేసి,వారికి ఎన్నికల గుర్తులు క్రమబద్ధంగా కేటాయించాలి అని సూచించారు. సందేహాలు ఉంటే ఎలెక్షన్ హ్యాండ్ బుక్‌ను అనుసరించాలి అని ఆమె సూచించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ (స్థానిక సంస్థలు) శివేంద్ర ప్రతాప్, ఇంచార్జ్ డిపిఓ వెంకట్‌రెడ్డి, ట్రైనీ డిపిఓ నిఖిల,ఆర్డీవో ఈ.నవీన్, మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి ప్రభుత్వ ఉద్యోగస్తులు అర్హులు : కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు5 ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీలో ఓటరుగా ఉండి, ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న, ప్రభుత్వ ఉద్యోగస్తులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి అర్హులు అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు.ఇప్పటివరకు ఫారం14 (అనగా పోస్టల్ బ్యాలెట్ కొరకై దరఖాస్తు) ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి పోస్టల్ బ్యాలెట్ పంపడానికితగు విధమైనచర్యలు,ఎన్నికల యంత్రాంగం చేపట్టినది మరొక అవకాశంగా, పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయుచున్నారు. పోస్ట్ ద్వారా బ్యాలెట్ పొందు అవకాశము లేనివారు లేదా పోస్టల్ బ్యాలెట్ వసతి వాడుకోలేనివారు,తమ ఫారం14 తీసుకొని నేరుగా తమ ఓటుహక్కు ఉన్న మండలంలోని ఎంపీడీవో కార్యాలయం నందు గల పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రము వద్ద తమ ఓటు వేయవచ్చు. ఈ సదుపాయము, మన జిల్లాలో డిసెంబర్ 8వ తేదీన ఫేస్1లో ఎన్నికలు జరుగుమండలాలు అయిన, గండీడు, మహమ్మదాబాద్,నవాబుపేట,రాజాపూర్, మహబూ బ్‌నగర్‌లలో ఉదయము 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయము నందు ఉంటుంది. రెండవపేజ్‌లో ఎన్నికలు గల మండలాలైన హన్వాడ చిన్నచింతకుంట, దేవరకద్ర, కౌకుంట్ల, కోయిలకొండ, మిడ్జిల్‌లలో డిసెంబర్ 12వ తేదీన ఇట్టి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను సంబంధిత ఎంపీడీవో కార్యాలయం నందు ఏర్పాటు చేస్తు న్నారు. మూడవ ఫేసులో ఎన్నికలు ఉన్న మండలాలైనా అడ్డా కల్, మూసాపేట, భూత్పూరు, బాలానగర్ జడ్చర్లలో ఈ సదుపాయము డిసెంబర్ 15వ తేదీన సంబంధిత ఎంపీడీవో కార్యాలయంనందు ఏర్పాటు చేయబడినది. కనుక ఫారం నెంబర్ 14 అనగా పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు తమ ఎలక్షన్ ఎపిక్ కార్డు ఎలక్షన్ ఉత్తర్వులను తీసుకొని వెళ్లి ఈ విధంగా ఏర్పాటు చేసిన మండలంలో గల ఫెసిలిటేషన్ కేంద్రాలలో బ్యాలెట్ పేపర్ పొంది,వెంటనే ఓటు వేసి, అక్కడగల డ్రాప్‌బాక్స్ లో వేయాలి.ఈకేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులువీరికి ఓటు వేయడంలో సహాయపడతారు. ఈ సదుపాయాన్ని తమ ఓటు హక్కు ఉన్న మండలంలో మాత్రమే వాడుకోవలసి ఉంటుంది. ఈ సదుపాయము ఎన్నికల విధులలోఉన్న ప్రభుత్వ సిబ్బందికిమాత్రమే వర్తిస్తుంది.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


వసంత భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్


మృతురాలి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బస్వరాజ్‌గౌడ్

**భూత్పూర్,డిసెంబర్ 5,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని నాల్గోవార్డు ఇందిరానగర్‌కాలనీకి చెందిన గడ్డం మానస(వసంత) మృతిచెందారు.మృతురాలు తన భర్త గడ్డంమునయ్య (మున్సిపల్ సఫాయి కార్మికుడు) ఇద్దరు బైక్‌పై గురువారం సాయంత్రం నసరుల్లాబాద్ (జడ్చర్ల) నుంచి భూత్పూర్‌కు జాతీయ రహదారి-44పై వస్తుండగా,హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వేగంగా వచ్చే కారు ఢీకొట్టగా,బైక్ వెనకాల కూర్చున్న మానస(వసంత)కు తీవ్రగాయాలై ఆపస్మారక స్థితికి చేరుకోగా,ఆమెను హైదరాబాద్‌కు తరలించారు.చికిత్స పొందుతూ గురువారం రాత్రి వసంత ఆసుపత్రిలో మరణించారు.శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని పలు పార్టీ నేతలు పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.విషయం తెల్సుకున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ తన వంతు ఆర్థిక సహాయం రు.5వేలు అందించి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ నారాయణ గౌడ్, సత్తూర్ చంద్రశేఖర్‌గౌడ్,టి మురళిధర్‌గౌడ్,తూము శ్రీనివాస్‌రెడ్డి,గడ్డం ప్రేమ్‌కుమార్,గడ్డం రాములు,గడ్డం డీలర్ నర్సింహులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ ఆర్థిక సాయం :** మున్సిపాలిటీ సఫాయి కార్మికుడు గడ్డం మునయ్య భార్య వసంత(మానస) మృతి విషయాన్ని తెల్సుకున్న భూత్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మృతురాలి ఇంటికి వెళ్లి మృతురాలి భౌతిక కాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించి,తన వంతుసహాయంగా రు.5వేలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులుబోరింగ్ నర్సింహులు,గడ్డంఎల్లప్ప,గడ్డం యాదయ్య,బజార్ పరుశురాం, మునయ్య,రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రలోభాలతో ఏకగ్రీవం చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

**బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త:** " గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి నడుస్తుంది. కోలాహలం కొనసాగుతుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అందరికి నచ్చిన వ్యక్తిని.. అందరితో కలిసిపోయే వ్యక్తిని గతంలో ఏకగ్రీవంగా ఎన్నుకునేది. కానీ ఆ సంస్కృతి పోయింది. గ్రామపంచాయితీ ఎన్నికలలో వేలం పాట పాడి, ప్రలోభాలతో ఏకగ్రీవం చేయడం ప్రజాస్వామ్యం కూని చేయడమే " అని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎవరి వద్ద డబ్బులు ఎక్కువ ఉంటే వాళ్లే సర్పంచ్ అని నలుగురు పెద్దమనుషులు నిర్ణయం చేస్తున్నారు. కోటి రూపాయలకు కూడా వేలం పాట పాడుతున్నారు. ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజలు అందరూ ఓటు హక్కు వినియోగించుకొని సర్పంచ్ లను ఎన్నుకోవాలి. గతంలో డబ్బు ప్రలోభాలు లేకుండా ఏకగ్రీవం చేసిన గ్రామాలు గతంలో అనేకం చూశాం కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అన్నారు. సర్పంచ్ పదవుల కోసం లక్షలలో వేలం పాటలు చూస్తుంటే


బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు,ఎంపీ డీకే అరుణ

ఆశ్చర్యం కల్గుతుంది. వేలం పాట పాడి సర్పంచ్ పదవుల దక్కించుకోవడం దురదృష్టకరం. ఇన్ని ఏళ్ల నుంచి అభివృద్ధి గుర్తుకు రాని వారు.. ఇప్పుడు అది చేస్తాం ఇది చేస్తాం అంటున్నారు వాళ్లను నమ్మకండి. గత ప్రభుత్వంలో బిల్లులు రాక సర్పంచ్ లు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారం గ్రామ పంచాయతీలకు నయా పైసా రాలేదు. బిఆర్ఎస్ హయంలో చేసిన పనులకు బిల్లులు ఇప్పటికీ రాలేదు.లక్షల రూపాయలు పెట్టి వేలం పాట వేస్తున్న నాయకులు.. పెట్టుబడి రాబట్టుకునే ఆలోచన చేస్తారు తప్ప అభివృద్ధి పైన శ్రద్ధ ఉండదు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోవడం కాదు.ఎన్నికల కమిషన్ బలవంతపు ఏకగ్రీవం పై సుమోటోగా కేసులు నమోదు చేయాలి. రాతపూర్వక ఫిర్యాదు రాలేదు అనడం విడ్డూరం.. ఏ గ్రామానికి వెళ్ళి ఎవరిని అడిగినా ఎంత వేలం వేశారో చెబుతారు. అభివృద్ధి చూసి ఓటు వేయండి.. అని సీఎం అంటున్నారు. అవును ఆ అభివృద్ధి కి నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం అనేది ఘంటా పదంగా చెబుతున్నామని తెలిపారు. అభివృద్ధి చూసి ఓటు వేయండి.. అభివృద్ధి జరిగింది నిధులు కేంద్రం నిధులతోనే.. అందుకే వారు బీజేపీ పక్షాన నిలవండి వేధింపులకు గురిచేసి అధికార పార్టీ కండువా కప్పుతున్నారు...గ్రామాలలో అభివృద్ధి జరుగుతుంది కేంద్ర బీజేపీ సర్కార్ నిధులతో మాత్రమే..గ్రామాల అభివృద్ధి చేస్తుంది మోదీ సర్కార్ అన్నారు. పంచాయతీ ఎన్నికల కోసం సీఎం హడావుడి చేస్తున్నారు.ప్రజలను మోసం చేసినందుకు కాంగ్రెస్ వాళ్ళు సంబరాలు చేసుకుంటున్నారు. తెలంగాణ ప్రజలు ఎవరు సంబరాలు చేసుకోవడం లేదు. ప్రభుత్వ డబ్బుతో ఎన్నికల వేళ పథకాలు పెట్టి కేసీఆర్ ఓట్లు కొన్నారు. అదే బాటలో కాంగ్రెస్ నడుస్తుంది. హిల్ట్ పేరిట లక్షల కోట్ల అవినీతి కుంభకోణానికి కాంగ్రెస్ తెరతీసింది కాంగ్రెస్ నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారు.. పేదలకు కాదు.రెండేళ్లలో ఎన్ని ఇండ్లు పూర్తి చేశారు.రెండేళ్లలో మీరు చేసిన అభివృద్ధి ఏంటి..? ఎన్ని హామీలు అమలు చేశారు.కాంగ్రెస్ హామీలు ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లు ఉంది.ప్రజలు మరోసారి మోసపోవద్దు.ప్రభుత్వానికి విజన్ లేదు.. కేవలం మాటల గారడీ చేస్తూ నడుపుతున్నారు.హిందూ దేవతలను రేవంత్ రెడ్డి అవమానిస్తున్నారు..దేవతలను అవమానించిన వారు ఎవరు బతికి బట్టకట్టలేదు. దేవుళ్ళ పై ఒట్టు పెట్టి.. అధికారంలోకి రేవంత్ రెడ్డి వచ్చింది మర్చిపోయావా..పదవి అహంకారంతో హిందు విశ్వాసాలపై మాట్లాడుతున్నారని అధికారం శాశ్వతం కాదఇ, అధికారంలో ఉన్నప్పుడు చేసిన మంచి మాత్రమే శాశ్వతం అని పార్టీలకు అతీతంగా పనులు చేయండి అని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా నిధులు ఇస్తుంది.కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఇతర పార్టీల ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వడం లేదు.ఇందిరమ్మ ఇండ్లకు ఇందిరమ్మ నిధులు ఇస్తుందా.. సోనియమ్మ ఇస్తుందా.. పేద ప్రజలు కట్టిన పన్నుల సొమ్ము తో ఇస్తున్నారు.అభివృద్ధి ధ్యేయంగా పనులు చేయండి.బెదిరింపులతో రాజకీయాలు చేయకండి.. శాంతియుతంగా పంచాయతీ ఎన్నికలు జరిగేలా సీఎం చొరవ చూపాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

# ఘనంగా క్రిస్మస్ సెలబ్రేషన్స్..

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త:** పాలమూరు ఫాస్టర్స్ ఫెల్లోషిఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా మహోన్నతంగా సాగిన క్రిస్మస్ గ్రాండ్ సెలెబ్రేషన్స్ ఆధ్యాత్మిక తీరుల్లో, భక్తి తరంగాల్లో వైభవంగా ముగిశాయి. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం జరిగిన ఈ వేడుకల్లో భజనలు, ప్రార్ధనలు, కీర్తనలతో నిండిపోగా అనేక మంది క్రిస్టియన్ సోదర సోదరీమణులు ఈ వేడుకల్లో పాల్గొని యేసు క్రీస్తును ఆరాధించారు. ముగింపు కార్యక్రమానికి గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, క్రైస్తవ సోదర సోదరీమణులకు హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "యేసు ప్రభువు కరుణ కటాక్షాలు మహబూబ్ నగర్ నగరంలోని ప్రతి ఒక్కరి మీద ప్రసరించాలని, యేసు యొక్క ప్రేమ, శాంతి, క్షమ, దయాస్వరూపాలు ప్రజల జీవితాల్లో శాశ్వతంగా వెలుగులు నింపాలని,ఈ పవిత్ర కాలంలో యేసు క్రీస్తు జనన సందేశం అందరికీ ఆనందం, సంతోషం తీసుకురావాలని "ఆకాంక్షి ంచారు. యేసు చూపినమార్గంలో అందరం కలిసిపయనిద్దామని ఆయన పిలుపుని చ్చారు. ఆధ్యాత్మిక ఉత్సాహంతో నిండిన ఈ వేడుకల్లో ప్రార్థనా కీర్తనలు, సందేశాలు, సేవా కార్యక్రమాలు విశేష ఆకర్షణగా మారాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన క్రిస్మస్ కేక్ ను ఎమ్మెల్యే గారు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, జిల్లా ఫిషరీస్ చైర్మన్ గోనెల శ్రీనివాస్ ,కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటి పట్టణ అధ్యక్షులు సామ్యెల్ దాసరి, చిన్న రాజు,వరికుంట రాము,రవి కుమార్ ,జాన్ వెస్లీ, పి.బాలకిషోర్, జయపాల్, ఎస్ ఎం.అమర్ మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి







విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ మంజులాదేవి

# పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

**జడ్చర్ల, డిసెంబరు 5 ప్రభాతవార్త:** మండల విద్యాశాఖ అధికారిని కే మంజుల దేవి కొండేడు ప్రాథమిక పాఠశాల, రామస్వామి గుట్ట తండా !! ప్రాథమిక పాఠశాల పెద్ద ఆదిరాల పాఠశాలలను సందర్శించారు. రామస్వామి గుట్ట తండా పాఠశాలలో 1 వ తరగతి ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో "పార్కింగ్" పాఠ్యాంశ బోధనను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపెయిన్ 5.0 లో భాగంగా పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కిచెన్ గార్డెన్ తదితర అంశాలను చక్కగా నిర్వహిస్తున్నందున ప్రధానోపాధ్యాయులు రవిని అభినందించారు. అనంతరం శిశీ పెద్దాదిరాల మరియు కొండేడు పాఠశాలలలో ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ లో భాగంగా 3వ తరగతి విద్యార్థుల తెలుగు !! గణిత సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల స్థాయి పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలలలో క్యాంపెయిన్ 5.0 కార్యక్రమం లో చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించారు. అదేవిధంగా . విద్యార్థులకు ఆపార్ ఐడి జనరేట్ చేయడం 100శాతం పూర్తిచేయాలని, డ్రాప్ బాక్స్ క్లియరెన్స్, యూనిఫాం ఆన్లైన్ ఎంట్రీ వంటి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

# పొగమంచు సమయంలో జాగ్రత్తలే రక్షణ

**సిగ్నల్స్ వద్ద అజాగ్రత్త తగదు**

**ఎస్పీ డి. జానకి సూచనలు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5, ప్రభాతవార్త:** చలి కాలం ప్రారంభమై జిల్లా వ్యాప్తంగా ఉదయం, రాత్రి వేళల్లో పొగమంచు తీవ్రంగా ఏర్పడుతున్న నేపథ్యంలో రోడ్లపై దృష్టి తగ్గడం, ముందున్న వాహనాల దూరం అంచనా కష్టపడడం వంటి ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్నందున, ప్రమాదాలు నివారించడం కోసం డ్రైవర్లు తప్పనిసరిగా కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా మహబూబ్నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి సూచించారు. పొగమంచు వలన రోడ్డు, సిగ్నల్స్, పాదచారులు, వాహనాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల చిన్న అజాగ్రత్త కూడా పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉందని ఎస్పీ పేర్కొన్నారు. అందుకే డ్రైవర్లు ముందుగా బయలుదేరడం,




అతివేగాన్ని నివారించడం, లోబీమ్ లైట్లు వాడటం, సురక్షి త దూరం పాటించడం వంటి సూచించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

**ముఖ్య సూచనలు..**

- పొగమంచు వలన ప్రయాణం ఆలస్యమయ్యే అవకాశం ఉందని ముందుగానే బయలుదేరాలి.
- అతివేగం, ఓవర్‌టేకింగ్ పూర్తిగా నివారించాలి.
- హైబీమ్ స్థానంలో లోబీమ్ లైట్లు, ఫాగ్ లైట్లు ఉపయోగించాలి.
- ముందున్న వాహనానికి తగినంత సురక్షి త దూరం ఉంచాలి.
- లేన్ చేంజ్ చేయకుండా నిర్దేశిత లేన్లలోనే ప్రయాణించాలి. కిటికీ అద్దాలను కొద్దిగా దించుకోవడం ద్వారా డ్రైవర్ దృష్టిని మెరుగుపరచాలి.
- పొగమంచు అధికంగా ఉన్నప్పుడు వాహనాన్ని ఆపి పరిస్థితి సాధారణం అయిన తర్వాతే ప్రయాణం



కొనసాగించాలి.- అద్దాలు, వైపర్లు, డిఫ్రాస్టర్లు శుభ్రంగా, సక్రమంగా పనిచేసేలా ఉంచాలి. ముందుగానే ఇండికేటర్లను ఉపయోగించి వెనుకవాహనదారులకు స్పష్టమైన సంకేతం ఇవ్వాలి.
- సడన్ బ్రేకులు వలన స్కిడ్ అవే ప్రమాదం ఉండేందున బ్రేకులు నెమ్మదిగా అప్లై చేయాలి.

జిల్లా ప్రజల ప్రాణాలు, రోడ్డు భద్రత అత్యంత ముఖ్యమని, ప్రతి డ్రైవర్ ఈ సూచనలను కచ్చితంగా పాటిస్తే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని ఎస్పీ పేర్కొన్నారు.


ఏకగ్రీవమైన సర్పంచ్, వార్డు మెంబర్లు

## జడ్చర్లలో సర్పంచ్, 8 వార్డులు ఏకగ్రీవం

**జడ్చురన్ల, డిసెంబరు 5 ప్రభాతవార్త :** జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి నాయకత్వంలో జడ్చర్ల మండలంలోని దేవుని గుట్ట తండాలో సర్పంచ్ గా కాంగ్రెస్ అభ్యర్థి కవిత కిషన్ నాయక్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే పంచాయితీలో కాంగ్రెస్ బలపరిచిన 8 మంది వార్డు సభ్యులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులను ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అభినందించారు.

## ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలి

- **రాకపోకలకు ఇబ్బందులు లేకుండా**
- **అధికారులకు సూచించిన ఎంపి డికె అరుణ**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 5 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్ పట్టణ నుంచి బండమీద పల్లి వెళ్ళే మార్గంకు అడ్డంగా హైవే రోడ్డు నిర్మిస్తుండటంతో రాకపోకలు భవిష్యత్‌లో పూర్తిగా నిలిచిపోతాయనీ ఎంపీ డీకే అరుణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో బండమీది పల్లి చౌరస్తా వద్ద జరుగుతున్న హైవే పనులను ఎంపీ పరిశీలించారు.



బండమీద పల్లి, అల్లీపూర్, గాజుల పేట, హురునగర్, ఇప్పలపల్లి, తాటికొండ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని అధికారులకు ఎంపీ డీకే అరుణ సూచించారు. ప్రత్యామ్నాయ మార్గంకు నిర్ణయం అనంతరమే బండమీదపల్లి చౌరస్తా వద్ద హైవే పనులు చేపట్టాలని అప్పటివరకు పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని అధికారులను ఆదేశించారు.


ఎన్‌సిసి క్యాడెట్లతో కలిసి విరాళం అందజేస్తున్న కలెక్టర్

## సాయుధ దళాల పతాక దినోత్సవం

**మహబూబ్‌నగర్, డిసెంబరు 5 ప్రభాతవార్త :** సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మన దేశ రక్షణలో త్యాగ నిరతితో అంకిత భావంతో మహత్తర భూమిక నిర్వహిస్తున్న సైనికుల సహాయార్థం ఏర్పాటు చేసిన సైనిక పతాక దినోత్సవం నిధికి విరాళాలు అంద చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ డి.జానకి లు విజ్ఞప్తి చేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భముగా మాజీ సైనికులు, ఎన్‌సిసి క్యాడెట్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ.డి.జానకి లు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ. శ్రీనివాస్ రెడ్డి, త్రివిధ దళాల మాజీ సైనికులు, పోలీసులు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్పీ డి. జానకితో ఎన్‌సిసి క్యాడెట్లు

## ట్రాఫిక్ పోలీసుల నిబద్ధత

**మహబూబ్‌నగర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఓ మహిళ తన ఆటోలో మర్చిపోయిన బ్యాగును తిరిగి అందజేసిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నది. శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2:30 ప్రాంతంలో మణికొండకు చెందిన జ్యోతి మహబూబ్నగర్ జిల్లా కోర్టు దగ్గర ఆటో ఎక్కి క్లాక్‌టవర్ వద్ద దిగింది. కొద్దిసేపటికే ఆమె తన బ్యాగు ఆటోలో మరిచిపోయినట్టు గుర్తించింది. ఆ బ్యాగులో 5 గ్రాముల బంగారు ఆభరణాలు,12 తులాల వెండి ఆభరణాలు ఉండటంతో ఆందోళన చెందిన ఆమె వెంటనే మహబూబ్నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని తెలిపింది. సమాచారం అందుకున్న వెంటనే ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంతు రెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది సంఘటన చోటుచేసుకున్న ప్రాంతానికి సంబంధించి సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలించారు. ఫుటేజ్‌లో కనిపించిన వివరాల ఆధారంగా ఆటోను గుర్తించారు. అనంతరం ఆటో డ్రైవర్ హరిచందర్‌ను సంప్రదించి స్టేషన్‌కు పిలిపించారు. ఆటో డ్రైవర్ వద్ద ఉన్న విలువైన ఆభరణాలున్న బ్యాగును ట్రాఫిక్ సిబ్బంది స్వాధీనం చేసుకుని, బాల్యానాయక్ పర్యవేక్షణలో జ్యోతి చేతికి సురక్షితంగా అప్పగించారు. ఈ వేగవంతమైన స్పందన, ఆధునిక సాంకేతికత వినియోగం, సేవాభావంపై కృతజ్ఞతగా బాధితురాలు మహబూబ్నగర్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపింది. మహబూబ్నగర్ ట్రాఫిక్ పోలీసుల ఈ చర్య ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడమే కాక, పోలీసుల పట్ల ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తోంది. జిల్లా ఎస్పీ డి. జానకి ట్రాఫిక్ సిబ్బంది చేసిన చురుకైన వేగవంతమైన స్పందనకు ప్రశంసించారు.


జ్యోతికి బ్యాగు అందజేస్తున్న పోలీసులు